సాక్షి
నంద్యాల
సోమవారం । 24 । మార్చి । 2025



శాస్త్రోక్తంగా పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీ భ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు పౌర్ణమి సందర్భంగా ఆదివారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు.



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు మండపేటకు చెందిన వంక నరేంద్రబాబు రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు.



నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్య కళావేదికపై ఆదివారం హైదరాబాద్‌కి చెందిన కె. రమాదేవి బృందం వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:35	ఉ॥ 4:57
ఆదోని	సా॥ 6:33	ఉ॥ 4:55
నంద్యాల	సా॥ 6:31	ఉ॥ 4:57
ఆత్మకూరు	సా॥ 6:30	ఉ॥ 4:52
బనగానపల్లె	సా॥ 6:33	ఉ॥ 4:55

హదీస్ వెలుగు:
తరచూ "అస్తగ్ ఫిరుల్లాహ్" చదువుతూ ఉండండి. "తౌబా" చేస్తూ ఉండండి. తెలిసీ, తెలియక చేసిన పాపాలను అల్లాహ్ హరిస్తారు.
– పవిత్ర ఖురాన్

వయస్సు మళ్లిన హామీ!

- 50 ఏళ్లకే పింఛన్ అమలులో కూటమి ప్రభుత్వం కాలయాపన
- పది నెలలు అవుతున్నా కార్యాచరణ అంటూ జాప్యం
- జిల్లాలో 2 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఎదురుచూపు
- వృద్ధాప్య, వితంతు కొత్త పింఛన్ల ఊసేలేదు



ఎన్నికల ముందు ఎన్నో అమలు కాని హామీలను గుప్పించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు సంక్షేమ పథకాల విషయంలో మీనమేషాలు లెక్కిస్తోంది. పది నెలలు కావస్తున్నా ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను దగా చేస్తోంది. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని చెప్పి ఇప్పుడు మొండిచేయి చూపిస్తోంది. ప్రస్తుతం ఉన్న వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ, చేనేత పింఛన్లలోనే కోత పెట్టి నిరుపేదల కడుపుకొడుతోంది. పాలకులు కార్యాచరణ అంటూ కాలయాపన చేస్తూ పేదల సహనాన్ని పరీక్షిస్తున్నారు.



కోవెలకుంట్ల: అధికారంలోకి వచ్చిన వెంటనే యువతకు 20 లక్షల ఉద్యోగాలు/ నెలకు రూ. 3 వేల నిరుద్యోగ భృతి, స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాది రూ. 15 వేలు, అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు ఏడాదికి రూ. 20 వేలు పెట్టుబడి సాయం, 19 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాల్లోపు వయస్సు ఉన్న ప్రతి మహిళకు నెలకు రూ. 1500 ప్రతి ఇంటికి ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్ల సరఫరా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమంటూ కూటమి నేతలు హామీ ఇచ్చారు. వీటిలో ఉచిత గ్యాస్ సిలిండర్ హామీని అరకొరగా అమలు చేసి చేతులు దులుపుకుంది. సూపర్‌సిక్స్ హామీలు అటుంచితే 50 ఏళ్లకు పింఛన్ అందుతుందని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఆశపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి జిల్లాలోని 29 మండలాల పరిధిలో 2.22 లక్షల మంది పింఛన్ దారులున్నారు. పింఛన్లకు అర్హత ఉండి మరో 4,500 మంది కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. గడిచిన పది నెలల కాలంలో వివిధ కారణాలు సాకు చూపి దాదాపు 7 వేల పింఛన్లు తొలగించారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి పింఛన్ల సంఖ్య: 2.22 లక్షలు	
ఇప్పటి వరకు కోత పెట్టినవి: 7 వేలు	కొత్త పింఛన్ల దరఖాస్తుల సంఖ్య: 4,500
జిల్లాలో 50 నుంచి 59 ఏళ్ల వయస్సు ఉన్న వారు: 2 లక్షల మంది	

జిల్లాలోని ఆయా మండలాల పరిధిలో 50 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాల్లోపు వయస్సు ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు దాదాపు 2 లక్షల మంది ఉన్నట్లు ప్రాథమిక అంచనా. వీరంతా పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ఆహార అలవాట్ల కారణంగా 50 ఏళ్లకే ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. బీపీ, షుగర్, కాళ్లనొప్పులు, తదితర దీర్ఘకాలిక వ్యాధులు వస్తున్నాయి. రెక్కాడితే కాని డొక్కాడని కుటుంబాలు వేల సంఖ్యలో ఉన్నాయి. దీర్ఘకాలిక వ్యాధులతో వ్యవసాయ, ఉపాధి పనులు చేయలేక ఇబ్బందులు పడుతున్నారు. కనీసం నెలకు రూ. 4 వేలు పింఛన్ వస్తే కుటుంబ పోషణ, మందులకు ఆసరాగా ఉంటుందని భావించిన వారికి నిరాశే మిగిలింది. ఒకవైపు పనులు చేతకాక, మరోవైపు ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందక ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నారు. 50 ఏళ్ల వారికి పింఛన్లు ఎప్పుడిస్తారని అర్హత ఉన్న వారు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.

కొత్త పింఛన్ల ఊసే లేదు

2024 సార్వత్రిక ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కొత్త పింఛన్ల ప్రస్తావననే పక్కన పెట్టింది. గత ఏడాది జనవరి నెల నుంచి ఎన్నికల కోడ్ వచ్చే నాటికి జిల్లాలో 4,500 మంది వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ, చేనేత, తదితర పింఛన్లకోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరికి గత ఏడాది జూన్ నెలలో కొత్త పింఛన్లు అందాల్సి ఉంది. వీరందరూ 14 నెలల నుంచి పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. పింఛన్ వస్తుందని ఆశగా గత పది నెలల నుంచి సచివాలయాల వద్ద వెళ్లి అడిగితే కొత్త పింఛన్లు విడుదల కాలేదని సిబ్బంది చెబుతుండటంతో ఉసురుమంటూ వెనుదిరుగుతున్నారు. గతంలో దరఖాస్తు చేసుకున్న వారే కాకుండా గత ఏడాది జూన్ నెల నుంచి పింఛన్ల కోసం అర్హత ఉండి దరఖాస్తు చేసుకునేందుకు వందల మంది ఉన్నారు. డిసెంబర్ నెల నుంచి కొత్త పింఛన్‌దారులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు ప్రకటించారు. అయితే ఇప్పటి వరకు సచివాలయల్లో పింఛన్ దరఖాస్తు వెబ్‌సైట్ ఓపెన్ కాకపోవడం గమనార్హం. ప్రస్తుతం పింఛన్ పొందుతూ అనారోగ్యం, వివిధ కారణాలతో పింఛన్ లబ్ధిదారుడు మృతి చెందితే అలాంటి పింఛన్లు మాత్రమే ఆ మరుసటి నెల ఇస్తున్నారు. గత జనవరి నుంచి మార్చి నెల వరకు ఇలాంటి పింఛన్ల కోసం వందల సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నా వాటిని పరిగణలోకి తీసుకోకపోవడం విచారకరం.

జగనన్న పాలనలో ఇలా..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న విప్లవాత్మక మార్పులు చేపట్టారు. గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకు పింఛన్ డబ్బులు ఠంచన్‌గా అందాయి. మొదట్లో పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న ఒకటి, రెండు నెలల్లో పింఛన్ చేతికందేది. తర్వాత ఏటా జూలై నుంచి డిసెంబర్ వరకు పింఛన్లకు దరఖాస్తు చేసుకున్న వారికి జనవరి నెలలో, జనవరి నుంచి జూన్ నెల వరకు దరఖాస్తు చేసుకున్న వారికి జూలై నెలలో కొత్త పింఛన్లు మంజూరు చేసి పేదలను ఆదుకుంది.

ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి



తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే 50 ఏళ్లకే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలవారికి పింఛన్లు ఇస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారు. పదినెలలు గడస్తున్నా ఇప్పటి వరకు ఆ హామీ అమలు కాలేదు. ఇప్పటి వరకు 50 ఏళ్ల పింఛన్ రాకపోగా నాకు 60 ఏళ్ల వయస్సు వచ్చింది. కనీసం వృద్ధాప్య పింఛన్‌కు దరఖాస్తు చేసుకుందామనుకున్నా కొత్త పింఛన్లు ఇవ్వడం లేదు.
– నాగయ్య, కోవెలకుంట్ల

ఇంకెన్నాళ్లు కాలయాపన



వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుని దాదాపు రెండేళ్లు కావస్తోంది. నా భర్త నాగరాజుకు ప్రతి నెల వృద్ధాప్య పింఛన్ వచ్చేది. అనారోగ్యంతో మృతి చెందగా భర్త పింఛన్ భార్యకు వస్తుందన్నారు. గత ఏడాది జనవరి నెలలోనే పింఛన్ రావాల్సి ఉంది. వివిధ కారణాలతో ఆ నెలలో రాకపోగా తర్వాత ఎన్నికలు వచ్చి ప్రభుత్వం మారిపోయింది. కొత్త ప్రభుత్వం వచ్చినా ఇప్పటి వరకు పింఛన్ అందలేదు. పింఛన్ మంజూరు చేసి అధికారులు ఆదుకోవాలి.
– లీలావతమ్మ, కోవెలకుంట్ల

పేదలకు ఆసరాగా నిలవాలి



ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం 50 ఏళ్ల నుంచి 59 ఏళ్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పింఛన్లు మంజూరు చేయాలి. ఈ వయస్సులో వివిధ రోగాలతో బాధపడుతూ ఎంతో మంది వ్యవసాయ, ఉపాధి పనులు చేయలేకపోతున్నారు. అలాంటి వారికి ప్రతినెలా వచ్చే 4 వేల రూపాయలు ఎంతో ఆసరాగా ఉంటుంది. 50 ఏళ్ల వయస్సు నిండి పింఛన్ వస్తుందని ఎదురు చూస్తున్నాను.
– దేవరత్నం, అవుకు

న్యూస్‌రీల్

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

నంద్యాల: స్థానిక కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జి.రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులు అందజేయాలన్నారు. ఉదయం 9.30 గంటల ప్రారంభమయ్యే కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ హాజరు కావాలన్నారు. జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో నిర్వహించే కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వెలుగోడు ఎస్‌ఐపై బదిలీ వేటు

వెలుగోడు: పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న వెలుగోడు ఎస్‌ఐ విష్ణు నారాయణపై బదిలీ వేటు పడింది. ఆయనను తిరుపతికి బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ కుమార్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల వేల్పనూరు – పెసరవాయి పంట పొలాల్లో పేకాట స్థావరంపై దాడి చేసిన సమయంలో రూ. 5 లక్షలు స్వాధీనం కాగా.. రూ. 12 వేలు చూపించారని ఆరోపణలు వచ్చాయి. అలాగే రెండు నెలల క్రితం స్టేషన్‌కు వచ్చిన గిరిజన సంఘం నాయకుల మనోభావాలను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడంపై వారు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసారు.ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు విచారణ చేయడంతో అక్రమాలు వెలుగు చూడటంతో తిరుపతికి బదిలీ చేసినట్లు తెలుస్తోంది.

అక్షరం నేర్పకుండానే..



అభ్యాసకులకు సూచనలు చేస్తున్న డీడీ చంద్రశేఖర్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): ఉల్లాస్ కార్యక్రమం కింద స్వయం సహాయక సంఘాల్లో నిరక్షరాస్యులకు అక్షరం నేర్పించకుండానే పరీక్ష నిర్వహించారు. ఎంపిక చేసిన కేంద్రాల్లో అక్షర జ్ఞానాన్ని నేర్పించే కార్యక్రమాన్ని వయోజన విద్యకు చెందిన సూపర్‌వైజర్లు పర్యవేక్షణ చేయాలి. కానీ వారు జిల్లా కేంద్రానికి పరిమితమై పర్యవేక్షణ చేయలేకపోవడంతో మెజార్టీ కేంద్రాల్లో అక్షరాలు నేర్చుకోలేదు. కొన్ని కేంద్రాల్లో స్వచ్ఛందంగా పొదుపు సంఘాల్లోని చదువుకున్న వారు అక్షరాలను నేర్పించినా...అది సంతకాల వరకే పరిమితం అయ్యింది. జిల్లాలో 670 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా 26,785 మందికి గాను 23,861 మంది హాజరయ్యారు. 2,924 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. మెజార్టీ కేంద్రాల్లో డీఆర్‌డీఓ గుర్తించిన నిరక్షరాస్య మహిళలు కాకుండా వారి పిల్లలు, అప్పటికే చదువుకున్న వారితో పరీక్ష నిర్వహించినట్లు తెలుస్తోంది. కొన్ని చోట్ల పరీక్షలు నిర్వహించకుండానే పరీక్షలు రాసినట్లు సంతకాలు చేయించుకున్నట్లు తెలుస్తోంది. పాణ్యంలో ఓ పరీక్ష కేంద్రాన్ని వయోజన విద్య ఉప సంచాలకులు చంద్రశేఖర్‌రెడ్డి పరిశీలించారు.

పెండింగ్ ప్రాజెక్టుల కోసం పోరాటం ఉద్ధృతం

నంద్యాల(అర్బన్): రాయలసీమ సాగునీటి పెండింగ్ ప్రాజెక్టుల కోసం పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి అన్నారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త ఆత్మకూరు రవీంద్రనాథ్ అధ్యక్షతన నూనెపల్లె అమ్మవారి శాలలో వైశ్య ప్రముఖులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నుకోబడిన ప్రభుత్వాలు ప్రజలు, రైతుల ఆకాంక్షలను గౌరవించి నిర్ణయాలు తీసుకోవాలన్నారు. గాలేరు నగరి, హంద్రీనీవా, కేఆర్ఎండీ ఏర్పాటు, సాగునీటి జలాల గురించి ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. సిద్దేశ్వరం అలుగు 9వ వార్షికోత్సవానికి 2 లక్షల మందితో ర్యాలీగా వెళ్లి సీమ రైతులకు జరుగుతున్న అన్యాయంపై ప్రభుత్వాన్ని నిలదీయనున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు వైఎస్ రెడ్డి, వైశ్య ప్రముఖులు అయ్యపుశెట్టి సుబ్రమణ్యం, శేషయ్య, గెలివి రామకృష్ణ పాల్గొన్నారు.

ముమ్మరంగా ఇంటర్ మూల్యాంకనం

- జిల్లాకు చేరుకున్న 2,01,066 జవాబు పత్రాలు
- రిపోర్ట్ చేసిన 432 మంది అధ్యాపకులు

నంద్యాల(న్యూటౌన్): ఇంటర్మీడియెట్ పరీక్ష జవాబు పత్రాల మూల్యాంకనం జిల్లాలో ముమ్మరంగా సాగుతోంది. నంద్యాల ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో ఈ ప్రక్రియ కొనసాగుతోంది. ఇటీవల పరీక్షలు ముగియడంతో అధ్యాపకులు పూర్తి స్థాయిలో మూల్యాంకనం ప్రక్రియకు హాజరవుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి నంద్యాల జిల్లాకు సుమారుగా 2,01,066 జవాబు పత్రాలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ముందుగా ఈ నెల 7వ తేదీ నాటికి సంస్కృతం పేపర్లు జిల్లాకు చేరుకున్నాయి. అప్పుడే మూల్యాంకనాన్ని ప్రారంభించినా ఈ నెల 22వ తేదీకి పూర్తిస్థాయిలో పేపర్లు చేరుకోవటంతో శనివారం నుంచి ఊపందుకుంది. ప్రస్తుతం ఇంగ్లిష్, మ్యాథ్స్, సంస్కృతం, హిందీ, ఫిజికల్స్, తెలుగు, సివిక్స్, కెమిస్ట్రీ, ఎకనామిక్స్ సబ్జెక్టులకు సంబంధించిన పేపర్లు జిల్లాకు చేరుకున్నాయి. మరో ఒకటి, రెండు రోజుల్లో కామర్స్, బాటనీ, జువాలజీ, పేపర్లు రానున్నాయి. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా 432 మంది అధ్యాపకులు అధికారులకు రిపోర్ట్ చేశారు. అందులో భాగంగా సంస్కృతం 12, తెలుగు–57, ఇంగ్లిష్–86, హిందీ–6, మ్యాథ్స్–84, సివిక్స్–32 చొప్పున బోర్డులను అధికారులు ఏర్పాటు చేశారు.



స్పాట్ వాల్యుయేషన్ జరుగుతున్న నంద్యాల ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల

ఒక్కొక్క బోర్డులో ఒక చీఫ్ ఎగ్జామినర్, ఐదుగురు అసిస్టెంట్ ఎగ్జామినర్లతో పాటుగా ఒక స్క్రూటినైజర్ ఉంటారు. అదేవిధంగా ఈ నెలలో మరో మూడు దఫాల్లో మరి కొంతమంది అధ్యాపకులు ఈ మూల్యాంకనంలో పాల్గొననున్నారు.

అధ్యాపకులను స్పాటుకు పంపించాలి



స్పాట్ వాల్యుయేషన్ విధులకు నియమించిన అధ్యాపకులను కళాశాల ప్రిన్సిపాళ్లు రిలీవ్ చేసి పంపించాలి. ఇప్పటికే స్పాట్ పూర్తిస్థాయిలో ప్రారంభమైంది. ఏప్రిల్ మొదటి వారం వరకూ ఈ మూల్యాంకనం ప్రక్రియ కొనసాగనుంది. కళాశాల ప్రాంగణంలో ఉన్న సదుపాయాలు, పేపర్ల సంఖ్యకు అనుగుణంగా అధ్యాపకులను రెండు మూడు దఫాలుగా హాజరయ్యే విధంగా ఏర్పాటు చేశాం.
– సునీత, డీఐఈఓ, నంద్యాల

వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



కన్నడ భక్తులకు మందులు పంపిణీ చేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ

జూపాడుబంగ్లా: శ్రీశైలం క్షేత్రానికి పాదయాత్రతో వెళ్లే భక్తులు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ వెంకటరమణ అన్నారు. మండలంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆదివారం ఆయన తనిఖీ చేశారు. వైద్య శిబిరాలకు కేటాయించిన సిబ్బంది అప్రమత్తంగా ఉండి భక్తులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని సూచించారు. తీవ్ర అస్వస్థతకు గురైన భక్తులు వస్తే ఆసుపత్రికి తరలించాలని సూచించారు. పాదయాత్ర భక్తులు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మధ్యాహ్న సమయంలో పాదయాత్రకు విరామం ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం జిల్లాలో బ్రాహ్మణకొట్కూరు, మండ్లెం, నందికొట్కూరు, ఆత్మకూరు, వెంకటాపురం, గూడెం, పెద్ద చెరువు ప్రాంతాలతో పాటు పలుచోట్ల 13 వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం జూపాడుబంగ్లా ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. ఆయన వెంట డాక్టర్ యశస్విని తదితరులు ఉన్నారు.

శ్రీశైలానికి పోటెత్తిన కన్నడిగులు



మల్లన్న దర్శనానికి బారులుదీరిన భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్రానికి కన్నడ భక్తులు పోటెత్తారు. కర్ణాటక, మహారాష్ట్రాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి సైతం భక్తులు తండోపతండాలుగా తరలివస్తున్నారు. కన్నడ భక్తులతో శ్రీగిరి క్షేత్రం నిండిపోయింది. ఆదివారం శ్రీశైలంలో భక్తుల రద్దీ నెలకొంది. వేకువజామున్నే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు మల్లన్న దర్శనానికి బారులు తీరారు. కన్నడ భక్తుల రద్దీతో ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్లు నిండిపోయాయి. కన్నడ భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగాణం మారుమోగుతుంది. ఈ నెల 27వ తేదీ నుంచి శ్రీశైలంలో ఉగాది మహోత్సవాలు జరుగనున్నాయి. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని కన్నడ భక్తుల సౌకర్యార్థం ఈ నెల 17వ తేదీ నుంచి 26వ తేదీ వరకు విడతల వారీగా మల్లన్న స్పర్శదర్శనాన్ని కల్పిస్తున్నారు. దీంతో కన్నడ భక్తులు మల్లన్న స్పర్శదర్శనం చేసుకునేందుకు బారులు తీరుతున్నారు. అయితే స్పర్శదర్శనం టికెట్లు ఇచ్చేందుకు కౌంటర్లు పెంచాలని పలువురు భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

పరీక్షల నిర్వహణ భారమాయె!

- 'పది' పరీక్షలకు అరకొర బడ్జెట్
- ఒక్కో విద్యార్థికి ఇస్తున్నది రూ.10 మాత్రమే
- ఆవేదనలో పరీక్షల నిర్వహణ యంత్రాంగం
- పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లపై భారం



పది పరీక్షలు రాస్తున్న విద్యార్థులు(ఫైల్)

నంద్యాల(న్యూటౌన్): పదో తరగతి పరీక్షల నిర్వహణకు కూటమి ప్రభుత్వం విడుదల చేసిన నిధులు ఎందుకూ సరిపోవడం లేదు. అదనపు నిధుల కోసం ఉపాధ్యాయ సంఘాలు చేసిన వినతిపై ప్రభుత్వం నుంచి స్పందన కరువైంది. దీంతో పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్ల (సీఎస్) జేబులకు చిల్లు పడుతోంది. పదో తరగతి పరీక్షల నిర్వహణకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. 2018లో ఒక్కో విద్యార్థికి కంటింజెంట్ చార్జ్ కింద రూ.5.50లు మాత్రమే ప్రభుత్వం చెల్లించేది. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పెరిగిన ధరలను అప్పటి సీఎం వైఎస్ జగన్ దృష్టిలో ఉంచుకుని కరోనా విపత్కర పరిస్థితిలోనూ 2020, 2021, 2023లో కంటింజెంట్ చార్జీ రూ.5.50 నుంచి రూ.8కు పెంచారు. 2024లో రూ.10కు పెంచారు. ప్రస్తుతం అదే చార్జీలనే కూటమి ప్రభుత్వం కొనసాగిస్తోంది. పెరిగిన ధరలకు అనుగుణంగా పరీక్షల నిర్వహణకు ఈ నిధులు సరిపోక అదనపు మొత్తాన్ని సీఎస్‌లు భరిస్తున్నారు.

అరకొర నిధులతో సతమతం

పోలీసు స్టేషన్లల్లో భద్రపరిచిన ప్రశ్న పత్రాలను పరీక్ష కేంద్రాలకు తరలించేందుకు, పరీక్షల అనంతరం జవాబు పత్రాలను తపాలా కార్యాలయానికి తరలించేందుకు రవాణా ఖర్చులు, కొవ్వొత్తులు, దారం, లక్క, స్టాప్లర్లు, స్కెచ్ పెన్నులు, గమ్, వైట్నర్ తదితర స్టేషనరీ కొనుగోలు తడిసి మోపెడవుతోంది. తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మీడియంల జవాబు పత్రాల కోసం వేర్వేరు సంచులను వాడుతున్నారు. ఒక్కో సంచి కోసం రెండు నుంచి మూడు మీటర్ల వరకు వస్త్రాన్ని వాడాల్సి వస్తోంది. దీంతో పరీక్షల నిర్వహణకు సంబంధించి కంటింజెంట్ చార్జీలను పెంచాలని కూటమి ప్రభుత్వానికి పలుమార్లు ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరారు. అయినా ప్రభుత్వం స్పందించలేదు. సాధారణంగా ఒక పరీక్ష కేంద్రంలో 100 మంది విద్యార్థులుంటే ప్రస్తుతం పరీక్ష నిర్వహణ కింద ఇస్తున్న ఒక్కో విద్యార్థికి రూ.10 చొప్పున ఇస్తుండటంతో కేవలం రూ.వెయ్యి మాత్రమే అందుతుంది. ప్రస్తుత ధరలతో పోల్చుకుంటే అన్ని ఖర్చులు కలిపితే రూ.5వేలకు పైగా అవుతుంది. దీంతో ప్రభుత్వం చెల్లించిన రూ.వెయ్యి పోను మిగిలిన రూ.4 వేలను సీఎస్‌లే భరించాల్సి వస్తోంది.

సీఎస్, డీఓలకు అరకొర భృతి...

ప్రతి పరీక్ష కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారిని నియమించారు. 240 మంది విద్యార్థులకు మించి ఉన్న కేంద్రానికి అదనంగా డీఓలు ఉంటున్నారు. సీఎస్‌లు, డీఓలు, కస్టోడియన్లు, ఇన్విజిలేటర్లకు రూ.150 నుంచి రూ.200ల భృతి కేటాయించాలన్న డిమాండ్‌ను సైతం ప్రభుత్వం తుంగలో తొక్కింది. ఇంటర్, పదో తరగతి పరీక్షల నిర్వహణకు పెద్దగా తేడా లేకపోయినప్పటికీ ఇంటర్ పరీక్షలకు సంబంధించిన ఇన్విజిలేటర్లకు రూ.150 చెల్లిస్తుండగా పదో తరగతి పరీక్షల ఇన్విజిలేటర్లకు కేవలం రూ.33 మాత్రమే చెల్లిస్తున్నారు. వాటర్ బాయ్‌కి రూ.17లు, అటెండర్‌కు రూ.20లు చొప్పున భృతి చెల్లిస్తున్నారు. అరకొర భృతి చెల్లింపులపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

భృతి పెంచాలి



ప్రస్తుత ధరలకు అనుగుణంగా పరీక్షల నిర్వహణ ఖర్చులు, భృతిని ప్రభుత్వం పెంచాలి. సీఎస్‌లు, ఇన్విజిలేటర్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులకు రోజుకు రూ.150 నుంచి రూ.200 భృతి చెల్లించాలి. కంటిజెన్సీ నిధులనూ పెంచాలి.
– శివయ్య, ఏపీటీఎఫ్, జిల్లా కార్యదర్శి, నంద్యాల

ప్రస్తుత ధరలకు అనుగుణంగా ఇవ్వాలి




ప్రస్తుత ధరలకు అనుగుణంగా రెమ్యునరేషన్ పెంచాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం ఇచ్చే నామమాత్రపు కంటిన్‌జెంట్ చార్జీ పరీక్షల నిర్వహణకు ఏ మూలకు సరిపోవడం లేదు. ప్రస్తుత సీఎస్, డీఓలతో పాటు ఇన్విజిలేటర్లకు కనీస చార్జీలు చెల్లించకపోవడం దురదృష్టకరం.
– పీవీ ప్రసాద్, యూటీఎఫ్ జిల్లా సెక్రటరీ, నంద్యాల

జాతీయ పోటీల్లో స్వర్ణం

కర్నూలు (టౌన్): అహ్మదాబాదులో ఈనెల 20 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించిన సీనియర్ జాతీయ బధిరుల (డెఫ్) టెన్నిస్ క్రీడలో కర్నూలు క్రీడాకారిణి జాఫ్రీన్ బంగారు పతకం సాధించింది. కర్నూలులో డిప్యూటీ రిజిస్ట్రార్ కో–ఆపరేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఆమె మహిళల సింగిల్స్ విభాగంలో స్వర్ణం, అలాగే నంద్యాల జిల్లాకు చెందిన చందన్‌తో కలిసి మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో బంగారు పతకం సాధించింది. దీంతో ఈ ఏడాది నవంబర్‌లో జపాన్ దేశంలో నిర్వహించనున్న అంతర్జాతీయ బధిరుల ఒలింపిక్స్‌లో పాల్గొనేందుకు అర్హత సాధించింది. ఈ సందర్భంగా క్రీడా సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

అమ్మానాన్నను వీడి అనంతలోకాలకు..

- మిద్దెపై నుంచి పడి చిన్నారి మృతి



మృతి చెందిన బాలిక శ్రీదేవి

కోసిగి: బుడిబుడి నడకలతో..వచ్చీ రాని మాటలతో... ముసిముసి నవ్వులతో అందరినీ మెప్పించే ఆ చిన్నారి ఇక లేరు. ఎప్పుడూ అమ్మానాన్న వెంటే ఉండే ఆ బాలిక ఈ లోకాన్ని వీడి వెళ్లి పుట్టెడు శోకాన్ని మిగిల్చింది. ప్రమాదవశాత్తూ ఇంటి మిద్దెపై నుంచి పడి మృత్యువాత పడింది. ఈ దుర్ఘటన కోసిగి మండలం వందగల్లు గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన లంకా ఆంజనేయులు, నాగలక్ష్మి దంపతులు వ్యవసాయ కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె శ్రీదేవికి మూడేళ్లు ఉండగా.. చిన్న కుమార్తె ఏడాది వయస్సులో ఉన్నారు. ఆదివారం తల్లిదండ్రులు ఇంటి పనుల్లో నిమగ్నమై ఉండగా పెద్ద కుమార్తె శ్రీదేవి (3) ఇంటి ఆవరణలో ఆడుకుంటూ ఉంది. ఆటల్లోనే మెల్లగా మెట్లు ఎక్కి మిద్దె పైకి వెళ్లింది. అదే సమయంలో ట్రాక్టర్ శబ్దం రావడంతో తండ్రి వెళ్తున్నాడని భావించి మిద్దెపై నుంచి తొంగి చూస్తూ కింద పడిపోయింది. తలకు తీవ్రమైన రక్త గాయం కావడంతో బైక్‌పై కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కళ్లెదుట కుమార్తె మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.



కుమార్తె మృతితో రోదిస్తున్న తల్లిదండ్రులు

క్లుప్తంగా

వృద్ధుడి మృతి

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామంలో ఓ వృద్ధుడు ఆదివారం మృతి చెందాడు. అవుకు మండలం కోనాపురం గ్రామానికి చెందిన కె.నర్సిరెడ్డి (80) అనే వృద్ధుడు దాదాపు 20 రోజుల నుంచి ఆకుమల్ల బస్టాండ్‌లో భిక్షాటన చేస్తూ అక్కడే ఉంటున్నాడు. సమయానికి మూడుపూటల ఆహారం లభించక అల్లాడేవాడు.ఈ క్రమంలో ఆదివారం ఉదయం వృద్ధుడి మృతి చెందాడు. గ్రామస్తులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతిడికి కుమారుడు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

వాహనాలు ఢీ.. ఒకరికి గాయాలు



ఎదురెదురుగా ఢీ కొన్న వాహనాలు

పాములపాడు: కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారిపై మండలంలోని కంబాలపల్లి గ్రామం వద్ద ఎదురెదురుగా రెండు వాహనాలు ఢీ కొన్న ఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. ఆదివారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు స్థానికులు తెలిపిన మేరకు.. కర్ణాటక రాష్ట్రానికి చెందిన కేఏ28ఎన్9688 నంబరు గల తుఫాన్ వాహనం శ్రీశైలం నుంచి 12 మంది ప్రయాణికులతో స్వరాష్ట్రానికి వెళ్తోంది. గా ఏపీ39 యూ 6833 నెంబరు గల ట్రాలీ వాహనం కర్నూలు నుంచి అట్టలతో ఆత్మకూరుకు వెళ్తోంది. ఆ రెండు వాహనాలు కంబాలపల్లి గ్రామం వద్ద ఎదురెదురై ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆత్మకూరుకు చెందిన ట్రాలీ డ్రైవర్ షేక్‌కాశీంవలి కాలు విరిగిపోవడంతో చికిత్స నిమిత్తం వెంటనే 108 వాహనం ద్వారా ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

కాటేసిన కరెంట్

గోనెగండ్ల: మండల పరిధిలోని వేముగోడు గ్రామానికి చెందిన మాదిగ భావన్న(30) అనే వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. సీఐ విజయ భాస్కర్ తెలిపిన వివరాల మేరకు.. వేముగోడు గ్రామానికి చెందిన మాదిగ భావన్నకు భార్య సునీత, కుతూరు, కుమారుడు ఉన్నారు. వీరు గ్రామంలో పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. శనివారం రాత్రి గ్రామంలో గాలి, ఉరుములు, మేరుపులతో కూడిన వర్షం పడింది. వర్షం పడిన అనంతరం రాత్రి 11:30 గంటలప్పుడు తన మిద్దె మీదకు వెళ్లి పడుకోవాలని మిద్ద పైకి ఎక్కాడు. అయితే అప్పటికే మిద్దమీద గాలికి తెగిన విద్యుత్ సర్వీస్ వైర్ కింద పడిఉంది. అవి తగిలి భావన్న అక్కడికక్కడే మృతిచెందారు. మృతుడి భార్య సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పోలీసు స్టేషన్‌లో అప్పగింత

పాణ్యం: మండల పరిధిలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థినుల వీడియోలు తీసి మార్ఫింగ్ చేసే విద్యార్థిని ఆదివారం పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే .. తమ తోటి విద్యార్థినుల సహాయంతో ఎవరైనా క్లోజ్‌గా మాట్లాడే సమయంలో వారికి తెలియకుండా వీడియోలు తీసేవారు. ఆపై వారి నంబర్లను స్నేహితురాలి సహకారంతో సేకరించి ఆ వీడియోలను మార్ఫింగ్ చేసి పంపి బెదిరింపులకు దిగేవారన్నారు. గతంలో ఒకరితో ఇలాగే చేయగా వారు పోలీసులకు ఫిర్యాదు చేసి సదరు విద్యార్థిని అప్పగించారు. ఈ విషయంపై ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డిని వివరణ కోరగా కళాశాల సిబ్బంది ఫిర్యాదు మేరకు విద్యార్థి అల్తాఫ్‌ను విచారణ చేస్తున్నట్లు తెలిపారు.



కావడీ మోస్తూ మల్లన్న చెంతకు..



బిడ్డతో వచ్చితిని నీ సన్నిధికి..

కన్నడిగులు కదిలివస్తున్నారు!

ఉగాది మహోత్సవాలను పురస్కరించుకుని కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు శ్రీశైలానికి పాదయాత్రగా తరలివస్తున్నారు. మండుటెండలను సైతం లెక్కచేయకుండా భక్తి మార్గంలో మల్లన్న చెంతకు చేరుకుంటున్నారు. భజనలు చేసుకుంటూ మల్లన్నను కీర్తిస్తూ.. కావడీలు భుజనా ఎత్తుకుని శ్రీగిరి వైపు వడివడిగా అడుగులు వేస్తున్నారు. శ్రీశైల భ్రమరాంబా దేవిని తమ ఇంటి ఆడపడుచుగా భావించి చీర, సారె సమర్పించేందుకు బయలుదేరారు. కొంత మంది ఇంటి నుంచి పాదయాత్రగా వస్తుండగా.. మరికొందరు ఆత్మకూరు సమీపంలోని వెంకటాపురం నుంచి నల్లమల అడవుల్లో సుమారు 42 కిలో మీటర్లు పాదయాత్రగా తరలివస్తున్నారు. వృద్ధులు, మహిళలు, చంటి పిల్లల తల్లులు సైతం శ్రీశైలం చేరుకుంటున్నారు. కైలాసద్వారం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించుకుని, అక్కడే కొంత సేపు సేదతీరి మల్లన్న, భ్రమరాంబ దర్శనం కోసం కూలైన్లలో బారులుదీరుతున్నారు. శ్రీగిరి భక్తజన సంద్రాన్ని తలపిస్తోంది.

– శ్రీశైలంటెంపుల్/జూపాడుబంగ్లా/ఆత్మకూరు

శివయ్యా.. కరుణించు..





మొక్కు తీర్చగా కర్రకాళ్లపై..



కైలాసద్వారం వద్ద భక్తజన సందడి..



నల్లమల మీదుగా పాదయాత్రగా..



నాగలూటి క్షేత్రంలో అన్నదానంలో పాల్గొన్న భక్తులు



భక్తిగీతాలు ఆలపిస్తూ..తల పై అమ్మవారి విగ్రహాన్ని మోసుకొంటూ..

8 మండలాల్లో అకాల వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని ఎనిమిది మండలాల్లో శనివారం అకాల వర్షాలు కురిశాయి. అత్యధికంగా వెల్దుర్తిలో 20 మి.మీ. వర్షపాతం నమోదైంది. సీ.బెళగల్‌లో 16.8, కల్లూరులో 9.2, పత్తికొండలో 6.6, ఎమ్మిగనూరులో 3.6, తుగ్గలిలో 2.6, గోనెగండ్లలో 2.0, కర్నూలు అర్బన్‌లో 0.4 మీ.మీ. ప్రకారం వర్షాలు కురిశాయి. జిల్లా మొత్తంగా 2.4 మి.మీ. వర్షపాతం నమోదైంది.

శ్రీశైలానికి వెళ్తుండగా ప్రమాదం

- కారును ఢీకొన్న లారీ.. ఏడుగురికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

కోడుమూరు రూరల్: కర్ణాటక రాష్ట్రంనుంచి శ్రీశైలానికి వెళ్తున్న కారును ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఏడుగురు వ్యక్తులు గాయపడ్డారు. దుర్ఘటన ఆదివారం కోడుమూరు–కర్నూలు రోడ్డులో ప్యాలకుర్తి వద్ద చోటు చేసుకుంది. కర్ణాటక రాష్ట్రం దావణగేరి జిల్లా నరసగండ్ల హల్లి గ్రామానికి చెందిన మురుగేంద్రయ్య, పద్మావతి, గౌరమ్మలతో పాటు మరో నలుగురు వ్యక్తులు కలిసి శ్రీశైల మల్లికార్జున స్వామిని దర్శించుకునేందుకు బయలుదేరారు. కోడుమూరు దాటిన తర్వాత ప్యాలకుర్తి వద్ద కారును ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో మురుగేంద్రయ్య, పద్మావతి, గౌరమ్మలకు రక్తగాయలవ్వగా, మిగిలిన నలుగురు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడ్డవారిని చికిత్స నిమిత్తం కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కోడుమూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పేలిన వంట గ్యాస్.. ముగ్గురికి గాయాలు

- గాయపడిన వీరిలో ఇద్దరి పరిస్థితి విషమం



సిలిండర్ పేలి ధ్వంసమైన ఇల్లు

ఆలూరు రూరల్: వంట గ్యాస్ లీకై సిలిండర్ పేలడంతో ముగ్గురు గాయపడ్డారు. ఇందులో గురుస్వామి, ధర్మ అనే బాలుడి పరిస్థితి విషమంగా ఉంది. మండలంలోని కురువళ్లి గ్రామంలో ఆదివారం తెల్లవారు జామున ప్రమాదం జరిగింది. ఎస్ఐ మహబూబ్ బాషా తెలిపిన వివరాలు.. కురువళ్లి గ్రామానికి చెందిన గురుస్వామి తన భార్య గాయత్రి, కుమరుడు ధర్మతో కలిసి ఇంట్లో నిద్రపోయారు. ఆదివారం తెల్లవారు జామున చుట్టుపక్కల వారు.. గ్యాస్ లీకైన వాసన వస్తోందని గురుస్వామికి చెప్పారు. ఆయన లైట్ ఆన్ చేయగానే ఒక్క సారిగా లీకైన గ్యాస్ మంటలు చెలరేగి పెద్ద శబ్దం వచ్చింది. ప్రమాదంలో గురుస్వామి, కుమారుడు ధర్మ తీవ్రంగా గాయపడ్డారు. గాయత్రికి స్వల్పగాయాలయ్యాయి. ఇల్లు ధ్వంసమైంది. క్షతగాత్రులను ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో ఆదోని ఆసుపత్రికి రెఫర్ చేశారు. ప్రస్తుతం గాయపడిన తండ్రి, కొడుకు ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గాయత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సరదాగా ఈతకెళ్లి..



యువకుని మృతదేహం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైల డ్యాం దిగువ భాగంలోని లింగాలగట్టు కృష్ణానదిలో సరదాగా ఈతకెళ్లిన ఓ బాలుడు నీట మునిగి మృతిచెందాడు. ఎం.వెంకటేశ్వర్లు కుమారుడు కార్తికేయ జస్వంత్ కృష్ణ (16) పదోతరగతి పరీక్షలు రాస్తున్నాడు. ఆదివారం సెలవు దినం కావడంతో తోటి పదోతరగతి స్నేహితులతో కలిసి ఆటవిడుపుగా ఆదివారం లింగాలగట్టు కృష్ణానదిలో ఈతకు వెళ్లాడు. ఈత కొడుతుండగా ప్రమాదవశాత్తు జస్వంత్ నీటిలో మునిగి మృతి చెందాడు. అక్కడి మత్స్యకారులు గుర్తించి మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సున్నిపెంట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో తమిళనాడు వాసి దుర్మరణం

కొలిమిగుండ్ల: అనంతపురం జిల్లా వెంకటరెడ్డిపల్లె సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తమిళనాడుకు చెందిన మురుగేషన్(49) మృతి చెందాడు. మృతుడు 20 ఏళ్ల నుంచి కొలిమిగుండ్లలో ఉంటున్నాడు. మంచాలు, కుక్కర్లు, మిక్సీలు, కూలర్లు తదితర ఎలక్ట్రానిక్ వస్తువులను కొలిమిగుండ్ల మండలంలోని పలు గ్రామాల్లో వాయిదాలకు ఇస్తుంటాడు. ఉదయం వ్యాపార పని నిమిత్తం బైక్‌పై తాడిపత్రికి వెళ్లి తిరుగు పయనమయ్యాడు. అదే సమయంలో ఇటిక్యాలకు చెందిన ట్రాక్టర్ బెలుం సమీపంలోని నాపరాతి గనిలో రాళ్లను లోడ్ చేసుకొని తాడిపత్రికి వెళుతున్న సమయంలో వెంకటరెడ్డిపల్లె వద్ద బైక్‌ను ఢీకొని మురుగేషన్ తలపై ఎక్కడంతో అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. మృతుడికి భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు.

ఎక్సైజ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

- అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా గిరిబాబు, విజయ్‌కుమార్



ఎన్నికల అధికారి కేఆర్ రాజేంద్రప్రసాద్ నుంచి డిక్లరేషన్ అందుకుంటున్న విజేతలు

కర్నూలు: ఎక్సైజ్ శాఖలో కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుళ్ల అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక కోలాహలంగా సాగింది. మూడేళ్లకు ఒకసారి సాగాల్సిన అసోసియేషన్ ఎన్నికలు తొమ్మిదేళ్లుగా వాయిదా పడుతూ వచ్చాయి. ఈ నేపథ్యంలోనే ఆ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. ఎన్నికల అధికారిగా ఈఎస్‌టీఎఫ్ సీఐ కేఆర్ రాజేంద్రప్రసాద్ వ్యవహరించారు. కర్నూలు ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో పనిచేస్తున్న ఎర్రల వెంకట గిరిబాబు పూర్వపు అధ్యక్షుడు ఓబులేసుపై 86 ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించారు. మొత్తం 207 మంది ఓటింగ్‌లో పాల్గొనగా, గిరిబాబుకు 146, ఓబులేసుకు 60 ఓట్లు రాగా, ఒక ఓటు చెల్లలేదు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొత్తం 14 ఎక్సైజ్ స్టేషన్లు, నంద్యాల కర్నూలు పీఎస్ కార్యాలయాలు, ఈఎస్‌టీఎఫ్, మొబైల్ పార్టీ, చెక్‌పోస్టులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బంది ఓటింగ్‌లో పాల్గొని నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అలాగే అసోసియేట్ అధ్యక్షులుగా ఎస్ఆర్ అబ్దుల్‌మాలిక్, ఉపాధ్యక్షులుగా బలరాముడు, పీ విరుపాక్షిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా విజయ్‌కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జయచంద్రుడు, సహాయ కార్యదర్శులుగా నక్కా సుధాకర్, పాలొళ్ల జగదీష్, ప్రెస్ సెక్రెటరీలుగా కేసీ శ్రీనివాసులు, డీ దస్తగిరి, కోశాధికారిగా కల్పన, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా జీ రాణి, ఎం రవికుమార్, కే వెంకటరాముడు, డీ చిన్న అల్లస్వామి ఎన్నికయ్యారు.

బీసీల హక్కులను కాలరాస్తున్న పాలకులు



మాట్లాడుతున్న నక్కలమిట్ట శ్రీనివాసులు

కర్నూలు(అర్బన్): పాలక పార్టీలు బీసీల హక్కులను కాలరాస్తున్నాయని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక బీ క్యాంప్‌లోని బీసీ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు మురళీమోహన్ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు వై నాగేశ్వరరావుయాదవ్, ప్రధాన కార్యదర్శి టీ మద్దులేటి, ప్రచార కార్యదర్శి ఎం. రాంబాబు, వైఎస్సార్‌పీపీ మహిళా విభాగం రాష్ట్ర నాయకురాలు భారతి, ఉపాధక్షులు గ్యాస్ శ్రీనివాసులు, రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాడాల నాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా నక్కలమిట్ట శ్రీనివాసులు మాట్లాడుతూ.. బీసీ కులగణన చేపట్టి జనాభా నిష్పత్తి మేరకు చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. చట్టసభల్లో బీసీ రిజర్వేషన్లకై ఉద్యమాలను చేపడుతామన్నారు. దేశంలో, రాష్ట్రంలో బీసీల ప్రయోజనాలను దెబ్బతీస్తూ వారి హక్కులను కూడా హరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో గొర్రెల పెంపకందారుల సంఘం చైర్మన్ శ్రీనివాసులు, పలు బీసీ కుల సంఘాల నాయకులు నాగేంద్రయాదవ్, శకుంతల, ఉప్పరి శివన్న, ధర్మ, పీజీ వెంకటేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కమిటీలో పలువురికి చోటు ...

ఈ నేపథ్యంలోనే బీసీ సంక్షేమ సంఘం జిల్లా కమిటీలో పలువురికి స్థానం కల్పించి నియామక పత్రాలను అందించారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా కుమ్మరి రామక్రిష్ణ, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా కుమ్మరి రాజేశ్వరి, కార్యదర్శిగా కే శ్రీనివాసులు, కోశాధికారిగా కే బజారన్న, కే గిరిబాబు, సహాయ కార్యదర్శిగా ఎం రవికుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా ఏ నాగార్జున, జిల్లా కమిటీ ఉపాధ్యక్షులుగా బీ రాధ, కార్యదర్శిగా సీ రేణుక, కే లింగన్నను నియమించారు.

‘పశుసంవర్ధక’ సంఘాలు ఏకగ్రీవం



నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నేరియన్స్ ఫెడరేషన్ కార్యవర్గ సభ్యులు

కర్నూలు(అగ్రికల్చర్): పశుసంవర్ధక శాఖలో మూడు సంఘాలకు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగాయి. కర్నూలులోని కొండారెడ్డిబురుజు సమీపంలోని బహుళార్ధ పశువైద్యశాల ప్రాంగణంలో నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నేరియన్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర ఫెడరేషన్ చైర్మన్ సేవానాయక్ హాజరయ్యారు. పశుసంవర్ధక శాఖలో ప్రభుత్వ గుర్తింపు పొందిన వెటర్నరీ అసిస్టెంట్స్ అసోసియేషన్, లైవ్‌స్టాక్ అసిస్టెంట్స్ సర్వీస్ అసోసియేషన్, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్స్ అసోసియేషన్/ వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవంగా నిర్వహించారు.

➡ ఆంధ్రప్రదేశ్ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నేరియన్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా శాఖ చైర్మన్‌గా జి.వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా బజారి, ఉపాధ్యక్షులుగా జనార్ధన్‌రెడ్డి, రాముడు,వెంకట రమణయ్య, ప్రధాన కార్యదర్శిగా రంగన్న, కోశాధికారిగా గంగ ఎన్నికయ్యారు.

➡ లైవ్‌స్టాక్ అసిస్టెంట్స్ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జీసీ సుబ్బరాయుడు, అసోసియేట్ ప్రసిడెంటుగా భరత్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఆయేశ్వరి, కోశాధికారిగా రాజేష్ ఎన్నికయ్యారు.

➡ వెటర్నరీ అసిస్టెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా స్రవంతి, అసోసియేట్ అధ్యక్షుడుగా మద్దిలేటి, ప్రధాన కార్యదర్శిగా హనుమంతు, కోశాధికారిగా శశిధర్ ఎన్నికయ్యారు.

➡ ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ జిల్లా నాయకులు జవహర్‌లాల్, సాంబశివారెడ్డి, రమణ, భాస్కరనాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల– ఆళ్లగడ్డ ఆర్‌అండ్‌బీ రహదారిలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి అందించిన సమాచారం మేరకు.. సంజామల మండలం కానాలకు చెందిన మేడిగ దానియేలు(45) వ్యవసాయ, ఉపాధి పనులకు వెళుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సొంత పనుల నిమిత్తం స్కూటీపై ఆళ్లగడ్డకు వెళుతుండగా పట్టణ శివారులోని పేరా బిల్డింగ్ వద్ద అటువైపే వెళుతున్న టర్బో లారీ వెనుక వైపు నుంచి స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దానియేలు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య రాణి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. లారీ డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా వెళుతుండటంతో ప్రమాద ఘటనను చూసిన వ్యక్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దొర్నిపాడు వద్ద లారీని ఆపి పోలీసులు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి శవపరీక్ష నిమత్తం మృతదేహాన్ని కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఆదోని సబ్ రిజిస్ట్రార్‌పై కేసు నమోదు

ఆదోని అర్బన్: కోర్టు ఆదేశాలను ధిక్కరించినందన ఆదోని సబ్‌రిజిస్ట్రార్ పాటు మరో ముగ్గురిపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. టూటౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. బ్రాహ్మణవీధికి చెందిన పవన్‌కుమార్ వద్ద అఖిలేష్‌గుప్తా అనే వ్యక్తి రూ.65 లక్షలు అప్పు తీసుకున్నారు. అప్పు ఇవ్వకపోవడంతో పవన్‌కుమార్ కోర్టును ఆశ్రయించారు. కోర్టు అఖిలేష్‌గుప్తా ఇంటి, అంగడిని అటాచ్ చేసి.. ఈ రెండింటినీ అమ్మకూడదని జనవరి 28వ తేదీన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి కోర్టు ద్వారా నోటీసు వెళ్లింది. అయితే కోర్టు ఆదేశాలను ధిక్కరించి అఖిలేష్ గుప్తా.. సబ్‌రిజిస్ట్రార్ అరుణ్‌కుమార్, డాక్యుమెంట్ రైటర్ భరత్, మరొక వ్యక్తి రమేష్ చంద్రతో మాట్లాడుకుని జనవరి 29న అంగడి, ఇల్లును అమ్మేశారు. అప్పు ఇచ్చిన పవన్‌కుమార్ తెలుసుకుని మరలా కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించినందుకు సబ్‌రిజిస్ట్రార్ అరుణ్‌కుమార్, డాక్యుమెంట్ రైటర్ భరత్, మరోవ్యక్తి రమేష్‌చంద్ర, అప్పు తీసుకున్న అఖిలేష్‌గుప్తాపై కేసు నమోదు చేయాలని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు కోర్టు ఉత్తర్వులు వచ్చినట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

నైతిక విలువలకు ప్రాధాన్యం

- ఏపీ ప్రైవేట్ ఆన్ ఎయిడ్ స్కూల్స్ యాజమాన్య సంఘం నేతలు



మాట్లాడుతున్న జి. పుల్లయ్య

కర్నూలు(సిటీ): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రైవేటు పాఠశాలల్లో నైతిక విలువలు, నాణ్యమైన విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఏపీ ప్రైవేట్ ఆన్ ఎయిడ్ స్కూల్స్ యాజమాన్య సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు వీ జనార్ధన్ రెడ్డి, గౌరవాధ్యక్షులు జీ పుల్లయ్య అన్నారు. ఆదివారం స్థానిక సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాలలో నగరంలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రైవేట్ ఆన్ ఎయిడెడ్ పాఠశాలల గుర్తింపును 8 సంవత్సరాల నుంచి 10 సంవత్సరాలకు పెంచాలన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఇంటి స్థలాలను, ఆరోగ్యశ్రీ కార్డులను, ఇళ్ల నిర్మించుకునేందుకు తక్కువ వడ్డీతో రుణాలను ఇప్పించాలన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్ శ్రీనివాసరెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షులు సీఆర్ షాహిదా, పట్టణ అధ్యక్షులు బీ యుగంధర్, కార్యదర్శులు కే శ్రీనివాస్, బీ మాధవక్రిష్ణతో పాటు జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారులు, స్కూళ్లకు అవసరమైన స్టాల్స్ స్టేషనరీ, యూనిఫామ్స్, లేబరెటరీ, సీసీ కెమెరాలు, కంప్యూటర్స్, ఎల్ఈడీ ప్యానల్స్, బోర్డ్స్, బుక్ పబ్లిషర్స్ పాల్గొన్నారు.